క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన పెన్షనర్ల సంఘ నాయకులు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా శాఖ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెల పెన్షనర్లకు ఒకటో తేదీనే పెన్షన్ వస్తుందన్నారు. పెన్షనర్ల సమస్యలుంటే వారిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సంఘ అధ్యక్షుడు బడే అంకిరెడ్డి, నాయకులు కంచర్ల సుబ్బారావు, మన్న హనుమంతరావు, డి. వెంకటేశ్వర్లు, మార్రెళ్ల వెంకట్రావు, చిల్లర శ్రీరామమూర్తి, ప్రభాకర్‌రావు, శరత్‌బాబు, రత్నాకర్, శేషయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు సీసీ కెమెరాల వితరణ

ఒంగోలు: ఆలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామ ఉప సర్పంచ్ చాగంటి సుధాకర రెడ్డి రూ. 10 వేల విలువైన రెండు సీసీ కెమెరాలను బహూకరించారు. పాఠశాల ఆస్తులతో పాటు విద్యార్థులకు భద్రత లభిస్తుందని పాఠశాల హెచ్‌ఎం జి.కోటమ్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గాదె శ్రీనివాసరెడ్డి, పూనూరి శైలేష్, ఆరుమూళ్ల సుబ్బారెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న చిన్న అప్పారావు

మద్దిపాడు: మండలంలోని సీతారాంపురం కొష్టాల సెంటర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో నందిపాడు సొసైటీ మాజీ చైర్మన్ పూనాటి చిన్న అప్పారావు చేతుల మీదుగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. గత 18 సంవత్సరాలుగా మార్రెళ్ల పూర్ణ చంద్ర రావు జ్ఞాపకార్థం నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఈ సంవత్సరం కూడా పంపిణీ చేస్తున్నట్లు అప్పారావు తెలిపారు. నాగరాజు, మాధవరావు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో రాణించాలి

మార్కాపురం: బీసీలు అన్ని రంగాల్లో రాణించాలని నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు కోరారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. దేశంలో 52 శాతం ఉన్న బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమన్యాయం జరుగుతుందన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను, సహకారాన్ని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని సూచించారు.

నేత్రపర్వంగా శ్రీగిరి బ్రహ్మోత్సవాలు

ఒంగోలు మెట్రో: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుడు అన్ని యుగాల దేవుడని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత ఒంగోలు నెక్స్‌ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రుని రమేష్ కృష్ణ అన్నారు. ఒంగోలు కొండపై శ్రీగిరి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఏర్పాటైన కార్యక్రమంలో డాక్టర్ రమేష్ కృష్ణ వేంకటేశ్వర వైభవం అనే అంశం పై ప్రసంగించారు. అష్టాదశ పురాణాలతో పాటు పలు గ్రంథాల్లోని భగవంతుని ఉనికి గురించి సాధికారిక విశేషాలను రమేష్ కృష్ణ చక్కగా వివరించారు. వెంకటాద్రితో సమానమైన కొండ గాని వేంకటేశ్వర స్వామితో సమానమైన దైవం గానీ లేరని రమేష్ కృష్ణ తెలిపారు. పాపాలను నశింప చేసి మోక్షాన్ని ప్రసాదించే దైవం వేంకటేశ్వరుడని వెల్లడించారు. డాక్టర్ రామచంద్రుని రమేష్ కృష్ణను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారితో పాటు ఆలూరు జైశంకర్ ఘనంగా సత్కరించారు. శ్రీగిరి వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో యాగశాల పూజలు, ప్రాకారోత్సవం, చూర్ణోత్సవం, విశేష స్నపన తిరుమంజనం, చక్ర స్నానం, ధ్వజ అవరోహణ, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమంత వాహనం పై కొలువుదీరిన శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించారు.

భక్తిశ్రద్ధలతో ఆకు పూజ

ఒంగోలు మెట్రో: శ్రీ క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం ద్వాదశి, మంగళవారం నగరంలోని హనుమాన్ దేవాలయాల్లో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేశవస్వామి పేటలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో.. మంగమూరు రోడ్డులోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, జిల్లా కోర్టు మాతా శిశు వైద్యశాల దగ్గర వెలసియున్న ఉన్న వీరాంజనేయ స్వామి దేవస్థానం, లాయరు పేట రైతు బజార్ దగ్గర ఉన్న చిట్టీ ఆంజనేయ స్వామి మందిరం, సంతపేట వీరాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తులు స్వామి వారి దర్శనం చేసుకున్నారు. నెహ్రూ నగర్ ఏడో లైను ఉన్న కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి, గడియారం వారి వీధిలోని ప్రసన్నాంజనేయ స్వామికి మంగమూరు రోడ్ లోని మర్రిచెట్ల కాలనీలోని పోలేమేర అభయాంజనేయ స్వామి దేవస్థానం, మంగమూరు రోడ్డు హరిహర క్షేత్రంలో కొలువైయున్న ప్రసన్నాంజనేయ స్వామికి విశేష పూజలు జరిగాయి. పసుపు, కుంకుమ, గంధం విభూది చందనం పన్నీరు వివిధ రకాల పండ్ల రసాలతో మన్యసూక్తంతో అభిషేక నిర్వహించి తమలపాకులతో అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించి స్వామి వారికి వడమాల కర్పూర హారతితో భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు సేకరించారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న ఆంజనేయ స్వామి



హనుమంత వాహనం పై దర్శనమిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి

ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలి



విధులపై అవగహన కల్పిస్తున్న ఎంపీడీఓ గౌసియాబేగం

పొదిలి రూరల్: ప్రజల సమస్యలపై ప్రభుత్వ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీడీఓ గౌసియాబేగం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాలలో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు విధులపై అవగాహన కల్పించారు. పింఛను పంపిణీ కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. లబ్ధిదారులకు రెండు రోజుల్లో నూరు శాతం పింఛను పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. హాజరు విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని చెప్పారు. గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో ఇంటి పన్ను బకాయిల గురించి అందరికీ వివరించి వసూలు చేయాలని సూచించారు.

సురేష్‌పై చర్యలు తీసుకోవాలి



నోడల్ ఆఫీసర్ సులోచనకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఒంగోలు టౌన్: రైట్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ సభ్యుడినంటూ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయడమే కాకుండా వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న యస్. సురేష్ మీద విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ కోరారు. మంగళవారం ఐసీడీఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ సులోచనకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలను తనిఖీ చేసేందుకు ఎలా అనుమతి ఇచ్చారని.. 2010 నుంచి రికార్డులను చూపించమని అడిగే అధికారం ఎవరు ఇచ్చారో తేల్చాలని డిమాండ్ చేశారు. రికార్డుల తనిఖీల పేరుతో సురేష్ పెద్ద మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నాడని, సెంటర్‌కు 1000 రూపాయలు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ ఇలాంటి తనిఖీలు చేయడం లేదని చెప్పారు. ఇప్పటికే దర్శిలో రూ. 3,25,000 స్వయంగా అధికారులే వసూలు చేసి ఇచ్చారని, టంగుటూరులో సైతం డబ్బులు వసూలు చేసి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఐసీడీఎస్ అధికారుల తక్షణమే జోక్యం చేసుకోవాలని, సురేష్ వ్యవహారంలో ఏం జరుగుతుందో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు యం. రమేష్, కోశాధికారి సుబ్బమ్మ ఉన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



కురిచేడు (దొనకొండ): మండలంలోని పడమటి గంగవరంలో గ్రామస్తులు ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 7వ వార్షికోత్సవం మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజారి మణికంఠ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రసన్నాంజనేయస్వామి వార్షికోత్సవంలో పాల్గొన్నారు. గ్రామస్తులు అన్నదానం చేశారు.

పౌరహక్కుల నేత గాండ్ల స్ఫూర్తిని కొనసాగించాలి

- ప్రజా నాట్య మండలి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు



గాండ్ల వెంకటరావు వర్ధంతి సభలో మాట్లాడుతున్న నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: చివరి శ్వాస వరకు ప్రజల కోసం నిలిచి పోరాడిన గాండ్ల వెంకటరావు స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) పిలుపునిచ్చారు. నగరంలోని మల్లయ్యలింగం భవనంలో పౌరహక్కుల నేత గాండ్ల వెంకటరావు 11వ వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర హక్కుల నేతగా ఎన్నో నిర్బంధాలను, ఆంక్షలను ఎదుర్కొన్నప్పటికీ తను నమ్మిన సిద్ధాంతాన్ని వీడలేదన్నారు. కులమతాల కతీతంగా ప్రజల పక్షం వహిస్తూ పాలక వర్గాలను నిలదీసిన అసలు సిసలు ప్రజా కళాకారుడిగా కూడా ఆయన జీవించారని చెప్పారు. పాలకవర్గాలే విధ్వంస కాండకు పాల్పడుతున్న విష సంస్కృతి నేడు దేశం అంతటా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు మేలుకొని ఇలాంటి సంఘటనలను ప్రశ్నించాలని, అప్పుడే ప్రజాస్వామ్యం బతికి బట్టకడుతుందని చెప్పారు. తొలుత గాండ్ల వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సభలో ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల వెంకటరావు, సంయుక్త కిసాన్ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, రైతు కూలీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యులు రాయపాటి ప్రసాద్ రావు, న్యూ డెమోక్రసీ నాయకులు గాండ్ల శ్రీనివాసరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న, సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సభలో అరుణోదయ, ప్రజా కళామండలి కళాకారుల పాడిన ప్రజా గేయాలు ఆకట్టుకున్నాయి.

ప్రైవేట్ పాఠశాలల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న విద్యాధికారి

దొనకొండ: మండలంలోని ప్రైవేటు పాఠశాలలను మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు మంగళవారం తనిఖీ చేశారు. విశ్వభారతి విద్యాలయం, సెయింట్ ఆంటోనీస్ పాఠశాల, సాయి విజ్ఞాన్ పబ్లిక్ స్కూళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పాఠశాలలను అనుమతులు లేకుండా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలు నిర్వహించే యాజమాన్యం గుర్తింపు పొంది ఉండాలని, అదే విధంగా పాఠశాలకు సరిపడిన సిబ్బంది తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు మంచి పేరు వచ్చేలా చూసుకోవాలని యాజమాన్యానికి ఎంఈఓ సూచించారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

ముండ్లమూరు: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని విద్యుత్ శాఖ ఒంగోలు ప్రొడక్షన్ ఏఈ జి. వీరాంజనేయులు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లో ఫీడర్లు, ట్రిప్పింగ్, బ్రేకర్స్, చార్జర్స్, రిలేషన్ టెస్టింగ్‌లను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. వర్షాల సందర్భంగా సాధారణంగా విద్యుత్ లైన్లు దెబ్బతింటాయన్నారు. దీంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. దీంతో వర్షం తగ్గిన వెంటనే సిబ్బంది లైన్ల వెంట తిరిగి విద్యుత్ లైన్లను పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ఎల్‌సీ తీసుకోకుండా పనులు చేయడం తగదన్నారు. సిబ్బంది సమన్వయంతో పని చేసి వినియోగదారులకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట సిబ్బంది సాంబమూర్తి, ఆంజనేయులు, ముజీం, ప్రతాప్ వర్మ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శివాలయం ద్వితీయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి దుర్భాకుల నగేష్‌శర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక, ఏకాదశి రుద్రాభిషేకం పూజలు చేశారు. భక్తులకు ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



టమోట

ఏం కొనేటట్టులేదు.. ఏం తినేటట్టు లేదు

- సెంచరీకి చేరువగా టమోటా
- క్యారట్, కాకర ధర కేజీ రూ.80



మిర్చి, బెండ, వంకాయ, క్యారెట్

మార్కాపురం: కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మార్కెట్‌కు రూ.100 నోటు తీసుకెళ్తే రెండు రోజులకు సరిపడా కూరగాయలు కూడా రావడం లేదు. ప్రస్తుతం టమోటా ధర కేజీ రూ.80 నుంచి రూ.90 మధ్య విక్రయిస్తున్నారు. మరో రెండు రోజుల్లో టమోటా ధర 100 రూపాయలకు చేరుతుందని వ్యాపారులు చెబుతున్నారు. స్థానికంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవడంతో బెంగళూరు, కర్నూలు, ఆత్మకూరు, మార్టూరు మార్కెట్ల నుంచి టమోటా, మిర్చి, కాకర, దొండ, బీరకాయలను దిగుమతి చేసుకుంటున్నారు. మార్కాపురం మార్కెట్ నుంచి రోజూ శ్రీశైలం, దోర్నాల, త్రిపురాంతకం, పెద్దారవీడు, తర్లుపాడు, కంభం మార్కెట్లకు కూరగాయల తరలిస్తారు. వారం రోజుల వ్యవధిలో కిలో టమోటా రూ.60 నుంచి 90 రూపాయలకు చేరిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆకుకూరల కట్ట ధర 15 రూపాయలకు చేరింది. తోటకూర, గోంగూర కట్ట 10 రూపాయలు కాగా, మెంతికూర, చుక్కకూర, బచ్చలకూర కట్ట 15 రూపాయల ప్రకారం విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితి వచ్చే నెలాఖరు వరకు ఉండవచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. వర్షాలు పడి స్థానిక గ్రామాల నుంచి కూరగాయలు మార్కెట్‌కు వచ్చేంత వరకు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

మార్కాపురంలో కూరగాయల ధరలు

రకం	కేజీ ధర(రూ.లో)	
	ప్రస్తుతం	10 రోజుల క్రితం
టమోటా	90	70
కాకర	80	65
బీరకాయ	80	65
చిక్కుడు	80	70
క్యారెట్	70	50
మిర్చి	70	60
బీట్‌రూట్	60	50
క్యాలీఫ్లవర్	60	50
దొండ	50	50
బెండ	50	40
క్యాబేజీ	50	40
క్యాప్సికం	50	40
ఉల్లిగడ్డలు	50	40



క్యారెట్, వంకాయలు



గోరుచిక్కుడు, కాకరకాయలు

ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులను అరికట్టాలి

మార్కాపురం టౌన్: ఫీజులు పట్టిక ఏర్పాటు చేయని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ జావీద్ అన్వర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలలు, కళాశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రైవేట్ పాఠశాలల వైపు విద్యాశాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూడటం సరికాదని పేర్కొన్నారు. మార్కాపురం పట్టణం, మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తుండటంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఫీజుల పట్టికను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయించాలని కోరారు.

ప్రోత్సాహక బహుమతుల పంపిణీ



నగదు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం అమూల్య

కంభం: స్థానిక బాలికోన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు మంగళవారం పంపిణీ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 569 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిన అయోషకు రూ.10 వేలు, 568 మార్కులు సాధించిన రెహానాకు ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు, 560 మార్కులు సాధించిన అఖిలకు తృతీయ బహుమతిగా రూ.5 వేలను బెంగళూరు ఆపిల్ సంస్థ డిజైన్ ఇంజినీర్ శివకృష్ణ అందజేశారు. నగదు బహుమతులను హెచ్‌ఎం అమూల్య అందజేశారు.

సేవా రంగంలో జేసీస్ కృషి మరువలేనిది

- జేసీస్ ఛాంబర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రాకేష్ శర్మ



రాకేష్‌శర్మను సన్మానిస్తున్న ఒంగోలు జేసీస్ ప్రతినిధులు

ఒంగోలు: వ్యక్తిత్వ వికాసం, సేవా రంగంలో ఒంగోలు జూనియర్ ఛాంబర్ మరువలేనిదని జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు జేఎఫ్ఎస్ అడ్వకేట్ రాకేష్ శర్మ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఒంగోలుకు చేరుకున్న ఆయన్ను ఒంగోలు జేసీస్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ వరుణ్, బి.శ్రీకాంత్‌లు ఆయన్ను ఘనంగా సత్కరించారు. స్థానిక కేబీ రెస్టారెంట్ సమావేశ హాలులో జరిగిన సమావేశంలో రాకేష్ శర్మ మాట్లాడుతూ ఉపకార వేతనాలు అందించడంలో, వ్యక్తిత్వ వికాసం అందించడం, సేవా కార్యక్రమాల నిర్వహణలో ఒంగోలు జేసీస్ ముందంజలో ఉందన్నారు. అనంతరం తోపుడు బండ్ల వారికి పెద్ద గొడుగులు బహూకరించారు. జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇండియా ప్రదానం చేసే పేద విద్యార్థుల ఉపకార వేతన జాతీయ నిధికి జాతీయ శిక్షకుడు తాడేపల్లి రవికుమార్ రూ.33వేలు, పి.రామాంజనేయులు, కేవీ వరుణ్‌కుమార్, పి.నందకుమార్, కె.శివారెడ్డి మొదలైన వారు మరో రూ.17వేలు అందించారు. కార్యక్రమంలో మాజీ జాతీయ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ, మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి కృష్ణారావు, ఒంగోలు జేసీస్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు సూరే ఏడుకొండలు, కసిబిసి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.